# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 29-11-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ బిజినెస్ ఎక్స్‌పో 2024ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈరోజు ప్రారంభించనున్నారు.
2. విద్యార్థుల ఆహార విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి హెచ్చరించారు.
3. ఆంధ్రప్రదేశ్‌లో ఈ రోజు నుండి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా వ్యాపార సంస్థల గణన కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహించనుంది.
4. రైతులకు కనీస మద్దతు ధర అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు.
5. తెలంగాణలో పదవ తరగతి పరీక్షల మార్కుల విధానంలో రాష్ట్ర ప్రభుత్వం మార్పులు చేసింది.

==========================

ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ బిజినెస్ ఎక్స్‌పో 2024ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈరోజు ప్రారంభించనున్నారు. రాష్ట్రంలో వ్యాపార రంగాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా విజయవాడలో ఈరోజు నుండి డిసెంబర్ 1 వరకు ఎక్స్‌పోను నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. మూడురోజులపాటు నిర్వహించే ఈ ఎక్స్‌పోలో ఆంధ్రప్రదేశ్‌లో వాణిజ్యరంగ అభివృద్ధి అవసరమైన పలు అంశాలపై చర్చిస్తారు.

--------------------------

తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకుల పాఠశాలల ‘విద్యార్థులకు పరిశుభ్ర వాతావారణంలో ఆహారం అందజేయాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వసతి గృహాల్లో తరచూ కలుషిత ఆహారం ఘటనలు జరగడంపై ముఖ్యమంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు డైట్ ఛార్జీలు పెంచామని తెలిపారు. విద్యార్థులకు ఆహారం అందించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హెచ్చరించారు.

ఇది ఇలా వుండగా కలుషిత ఆహారం కేసులకు సంబంధించి కారణాలను నిర్ధారించేందుకు తెలంగాణ ప్రభుత్వం టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. ఆహార భద్రతా కమిషనర్, అదనపు డైరెక్టర్, జిల్లా స్థాయి అధికారితో కమిటీ ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గురుకులాలు, హాస్టళ్లు, అంగన్వాడీలు, ఆసుపత్రుల్లో ఆహార

నాణ్యతను టాస్క్‌ఫోర్స్ పర్యవేక్షించనుందని ప్రభుత్వం తెలిపింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఈ రోజు నుండి ప్రారంభం కానున్న సూక్ష్మ, చిన్న, మధ్య తరహా వ్యాపార సంస్థల గణన కార్యక్రమంలో ప్రతి వ్యాపారవేత్త పాల్గొనేలా అవగాహన కల్పించాలని ఆ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. అమరావతిలోని సచివాలయంలో రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ అధికారులతో మంత్రి నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆయా జిల్లాలలోని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్లు జిల్లా కలెక్టర్లకు సర్వేకు సంబంధించిన పూర్తి వివరాలను తెలియజేయాలని సూచించారు.

---------------------------

రైతులకు కనీస మద్దతు ధర అందించేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కృష్ణా జిల్లా పామర్రు నియోజకవర్గంలోని కనుమూరు, కొండాయపాలెం, అడ్డాడ గ్రామాలలో నిన్న పర్యటించిన మంత్రి ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ రైతు నుంచి ప్రతి గింజ కొనుగోలు చేసి ఎన్డీయే కూటమి ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు అంశంలో రైతులకు అనుకూలంగా రాష్ట్ర ప్రభుత్వం సంస్కరణలను తీసుకొచ్చిందని, జిల్లా వ్యాప్తంగా రైతుకు నచ్చిన మిల్లుకు తమ ధాన్యం అమ్ముకోవచ్చని మంత్రి వివరించారు.

---------------------------

రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖమంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. తిరుపతి జిల్లా తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున గత సాయంత్రం పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ..

..వాయిస్...35 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం –పిపిపి విధానంలో రాష్ట్ర రహదారులు, జాతీయ రహదారుల అభివృద్ధి కోసం మూడు వేల కోట్ల రూపాయలను కేటాయించామని రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. వైయస్సార్ జిల్లా ఒంటిమిట్ట మండలం మలకాటి పల్లెలో జరుగుతున్న రహదారి మరమ్మతుల కార్యక్రమాన్ని మంత్రి నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత్ మాల కార్యక్రమంలో భాగంగా 28 వేల కోట్ల రూపాయలను రహదారుల నిర్మాణానికి ఖర్చు చేయనున్నామని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రాయోజిత కార్యక్రమాల ద్వారా రాష్ట్రంలో రహదారులన్నింటికీ 70 వేల కోట్ల రూపాయలతో మరమ్మతులు, అభివృద్ధి పనులు చేయనున్నట్లు మంత్రి వివరించారు.

---------------------------

తెలంగాణలో పదవ తరగతి పరీక్షల మార్కుల విధానంలో రాష్ట్ర ప్రభుత్వం మార్పులు చేసింది. ప్రస్తుతం

పదవ తరగతిలో 20 అంతర్గత మార్కులు, 80 మార్కులకు పరీక్షలను నిర్వహిస్తుండగా, అంతర్గత మార్కుల విధానాన్ని ప్రభుత్వం పూర్తిగా రద్దు చేసినట్లు రాష్ట్ర విద్యాశాఖ తెలిపింది. ఇకపై 100 మార్కులకు పదవ తరగతి పరీక్షలు జరగనున్నాయని 2024-25 విద్యా సంవత్సరం నుంచి ఈ నూతన విధానం అమల్లోకి వస్తుందని విద్యాశాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇకపై విద్యార్థులకు 24 పేజీల జవాబు పత్రాన్ని ఇవ్వనున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

---------------------------

ఎన్డీఏ కూటమి పాలనలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి తిరోగమనంలో ఉందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని అన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో అనేక మార్పులు తీసుకొచ్చామని తెలుపుతూ,

వాయిస్ (30 సెకన్లు)

---------------------------

గోవా వేదికగా జరిగిన 55వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం-ఇఫీ గత రాత్రితో ముగిసింది. చలనచిత్రోత్సవం ముగింపు సందర్భంగా ఆస్ట్రేలియా దేశానికి చెందిన చిత్ర దర్శకులు ఫిలిప్ నోయిస్‌కు 'సత్యజిత్ రే జీవన సాఫల్య పురస్కారం ఇఫీ 2024' ను అందజేశారు. ఈ పురస్కారం కింద 10 లక్షల రూపాయల నగదుతోపాటు, వెండి నెమలి, దృవప్రతాన్ని ఆయనకు అందజేశారు. ఈనెల 20వ తేదీ నుండి ప్రారంభమైన ఇఫీ ఉత్సవాలు 9 రోజుల పాటు ఘనంగా జరిగాయి. వివిధ దేశాలకు చెందిన చలన చిత్ర ప్రముఖులు ఇఫీ వేడుకకు హాజరయ్యారు.

---------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుపానుగా రూపాంతరం చెందలేదని, తీవ్ర వాయుగుండంగా కొనసాగుతుందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. వాయవ్య దిశగా కదులుతూ రేపు ఉదయం పుదుచ్చేరి- తమిళనాడు మధ్యలో తీరం దాటవచ్చని తెలిపింది. వాయుగుండం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో ఈ రోజు, రేపు పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవచ్చని పేర్కొంది. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లొద్దని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.

మరోవైపు తెలంగాణలో చలి తీవ్రత పెరిగిందని హైదరాబాద్ వాతావరణం కేంద్రం తెలిపింది. పలు జిల్లాల్లో పది డిగ్రీలలోపే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, మరి కొన్ని రోజులు ఇదే పరిస్థితి కొనసాగుతుందని తెలిపింది.

---------------------------

తెలంగాణలో మెరుగైన విద్య అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన విద్యా కమిషన్ బృందం రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించనుందని విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో కమిషన్ ఛైర్మన్ ఏ. మురళి నేతృత్వంలో కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ విశ్వేశ్వర్, వెంకటేశ్, జ్యోత్స్నలు పర్యటించనున్నారు. ఈ కమిషన్ వచ్చే నెల 7 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ విద్యా సంస్థల్లో పర్యటించి.. అక్కడి పరిస్థితులను కమిషన్ సభ్యులు పరిశీలించి, అవసరమైన సలహాలు, సూచనలు చేయనుందని తెలిపారు. కమిషన్ పర్యటన నేపథ్యంలో అవసరమైన

చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ. శాంతి కుమారి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

---------------------------

విద్యుత్ సరఫరా అవసరానికి తగినట్లు కొత్త విద్యుత్ ఉప కేంద్రాలను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఆక్వా రైతులు, యజమానులతో మంత్రి నిన్న సమావేశమయ్యారు. రైతులు ఆక్వా సాగులో విద్యుత్తు సరఫరా సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామని రైతులకు మంత్రి హామీ ఇచ్చారు. లోడ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాలపై దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. త్వరలోనే ఆక్వా రైతుల సమస్యలపై సరైన నిర్ణయం తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం 'ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్' –ఈగల్‌ను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాజధాని అమరావతిలో కేంద్ర కార్యాలయం, జిల్లాల్లో శాఖ కార్యాలయాలు ఏర్పాటు చేస్తూ హెూంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు జారీ చేశారు. మత్తు పదార్థాల కేసుల విచారణకు విశాఖపట్నం, రాజమహేంద్రవరం, విజయవాడ, గుంటూరు, తిరుపతిలలో 5 ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ న్యాయస్థానాలనులను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తున్నామని, సాధ్యమైనంత త్వరగా ప్రక్రియ పూర్తి చేస్తామని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. కర్నూలులో పాత్రికేయులతో మాట్లాడుతూ, కర్నూలులో హైకోర్టు బెంచ్ పెడతామని ఎన్నికల్లో హామీ ఇచ్చామని, శాసనసభలో ప్రకటనకు ముందే బెంచ్ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభించామన్నారు. ఆరు నెలల్లో హైకోర్టు బెంచ్ ఏర్పాటు ప్రక్రియ పూర్తయ్యే అవకాశముందని, లోకాయుక్త, మానవ హక్కులు కమిషన్ కార్యాలయాలు కర్నూలులోనే ఉంటాయని మంత్రి తెలిపారు.

======================